విద్యార్థులకు రాజకీయాలు అవసరం : కవి, జర్నలిస్టు నల్లి ధర్మారావు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : భావి భారతాన్ని నిర్మించడంలో విద్యార్థులపై కీలకపాత్రని, వారిని సమకాలీన రాజకీయాలకు దూరం చేయడం సబబు కాదని కవి, రచయిత, సీనియర్ జర్నలిస్ట్ నల్లి ధర్మారావు చెప్పారు. శుక్రవారం ఉదయం ఎచ్చెర్ల మండలంలోని శివాని ఇంజనీరింగ్ కళాశాలలో, స్టూడెంట్స్ ఇన్ పాలిటిక్స్ అనే సినిమా రెండో షెడ్యూల్ ప్రారంభోత్సవ కార్య క్రమంలో ఆయన మాట్లాడారు. రాజకీయ చైతన్యానికి విద్యార్థులను దూరం చేయాలనే కుట్రతో, ప్రభుత్వాలు విద్యాసంస్థల్లో విద్యార్థి సంఘాల ఎన్నికలు రద్దు చేశాయని ఆరో పించారు. దేశ పౌరులందరికీ రాజకీయాలపై అవగాహన అవసరమని, విద్యావంతులైన వాళ్లు రాజకీయాలను పట్టించుకోకపోతే ప్రజా స్వామ్యానికి ప్రమాదం తప్పదని హెచ్చరించారు. కళింగ ఆర్ట్స్ క్రియేషన్స్ పతాకంపై నిర్మాత, దర్శకుడు గూన అప్పారావు నిర్మిస్తున్న స్టూడెంట్స్ ఇన్ పాలిటిక్స్ అనే సినిమా తెలుగు, ఒరియా, హిందీ భాషల్లో విడుదల కానున్నది. తెలుగు వెర్షన్ కు ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర నాయకులు ఎన్ ఈశ్వరరావు క్లాప్ కొట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, ఉన్నత విద్యను అభ్యసించే దశలోనే దేశ రాజకీయాల పట్ల కూడా అవగాహన అవసరం అన్నారు. గతంలో శ్రీకాకుళం జిల్లాలో జన్మించిన పోరాట యోధురాలు వీరన్న జీవిత చరిత్రను సినిమాగా వెలుగులోకి తెచ్చిన గూన అప్పారావు కృషిని గుర్తు చేశారు. ఈ సినిమా కూడా విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఒరియా వెర్షన్ కు నల్లి ధర్మారావు క్లాప్ కొట్టారు. హిందీ వర్షన్ కు ప్రముఖ సామాజిక కార్యకర్త డాక్టర్ బాదాన దేవభూషణరావు క్లాప్ కొట్టారు. 90 శాతం జిల్లా కళాకారులతోనే ఈ సినిమా తీస్తున్నామని, అక్టోబర్లో విడుదల చేయడానికి ప్రయత్నిస్తున్నామని డైరెక్టర్ అప్పారావు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు గొంటి గిరిధర్, ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టు సంఘ నాయకులు మల్లారెడ్డి కళ్యాణ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

80 మంది శివాని ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక

విశాలాంధ్ర-ఎచ్చెర్ల : ఈ మండలంలో గల శివాని ఇంజనీరింగ్ కాలేజీకి చెందిన 80 మంది ఇంజనీరింగ్ విద్యార్థులు చెన్నైలో గల, మిత్సుబ కంపెనీలో ఉద్యోగాలకు ఎంపికైనట్లు, ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ యండ శ్రీనివాస్‌రావు తెలిపారు. ఈ కళాశాలలో రెండురోజులపాటు మిత్సుబ కంపెనీ యాజమాన్యం ప్రాంగణ నియామకాలకు శివాని ఇంజనీరింగ్ కాలేజీలో ఇంటర్వ్యూలు నిర్వహించారని ఆయన తెలిపారు. నాలుగు సంవత్సరాలు వివిధ ఇంజనీరింగ్ కోర్సులు పూర్తి చేసుకున్న 250మంది విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించగా, 80 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డిటి చంద్రశేఖర్, టిపిఓ డాక్టర్ బి. ప్రసాద్ రావు, విద్యార్థులు పాల్గొన్నారు.

స్మశాన వాటికలో చెత్త తొలగింపు

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : సంతబొమ్మాళి మేజర్ పంచాయతీలో గల ఎర్రబంధ దగ్గర ఉన్న స్మశాన వాటికలో ఉన్న చెత్తను సర్పంచ్ కళింగపట్నం లక్ష్మీ అప్పారావు తొలగించే కార్యక్రమం చేపట్టారు. అలాగే అక్కడ ఉన్న డ్రైనేజీలో పేర్కొన్న చెత్త తొలగించె చర్యలు చేపట్టారు. జేసిబి లు,ట్రాక్టర్లు తో చెత్త ఎత్తివేసి దూరంగా వేయించినట్లు సర్పంచ్ తెలిపారు. ప్రజలు స్వచ్ఛందంగా పారిశుద్ధ్యంకు సహకరించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఫిజియోథెరపిస్ట్ మృతి

విశాలాంధ్ర-పలాస: మండలం సరియాపల్లి పాత జాతీయ రహదారి సమీపంలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ శివాజీనగర్‌కు చెందిన ఫిజియో థెరిపిస్టు ఇప్పిలి కళ్యాణి (20) అక్కడికక్కడే మృతి చెందింది. కాశీబుగ్గ పోలీసులు, స్థానికుల కథనం మేరకు కళ్యాణి ద్విచక్ర వాహనంపై కాశీబుగ్గ నుంచి బెండిగేటు వైపు వెళ్తుండగా ముందు వెళ్తున్న కారును దాటి అతివేగంతో వెళ్తున్న సమయంలో విశాఖ నుంచి ఇచ్ఛాపురం వెళ్తున్న విశాఖ డిపో ఆర్టీసి బస్సు ముందు భాగంకు బలంగా ఢీకొట్టడంతో అక్కడి కక్కడే మృతి చెందింది. మృతిరాలు ఫిజియోథెరిపి విభాగంలో పని చేస్తుందని, కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల రోగుల ఇంటి వద్దకు వెళ్లి సేవలను అందిస్తుంది. ఇటీవలే ద్విచక్ర వాహనంను(స్కూటీ) కొనుగోలు చేసిందని కుటుంబ సభ్యులు తెలిపారు. కళ్యాణికి తండ్రి బాలరాజు, తల్లి పుణ్యవతి, అన్నయ్య నందులున్నారు. తండ్రి జీడి పరిశ్రమలో పని చేస్తుండగా తల్లి గృహిణి, అన్నయ్య ఐటిఐ చదువుతున్నారు. పేదరిక కుటుంబానికి చేదోడు వాదోడుగా ఉంటూ తనవంతుగా ఆర్థిక సహాయంతో ఆదుకుంటున్న సమయంలో కళ్యాణి రోడ్డు ప్రమాదం మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ప్రమాద సంఘటన తెలుసుకున్న కాశీబుగ్గ పోలీసులు, ఆర్టీసి డిపో మేనేజర్ రోణంకి సీతారాంనాయుడు, సంతోష్‌కుమార్, ఎస్.వెంకటేశ్వరులు సంఘటన స్థలానికి వెళ్లి ప్రమాదంకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కాశీబుగ్గ హెచ్.సి రవికుమార్ తెలిపారు.

నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర-కాశీబుగ్గ : సమాజంలో జరుగుతున్న నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, నేరాలు జరిగిన సమయంలో జరిగిన ఘటనలపై పోలీసుల, న్యాయస్థానం దృష్టికి తీసుకురావాలని పలాస సివిల్ కోర్టు ఇన్‌చార్జీ న్యాయమూర్తి చక్రవర్తి మల్లా అన్నారు. శుక్రవారం పలాస మండల న్యాయ సేవా సంఘం, బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలాస జూనియర్ కళాశాల, మున్సిపల్ కార్యాలయంలో విద్యార్థులు మెప్మా ఆర్.పిలతో న్యాయవిజ్ఞాన సదస్సు కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జరిగిన ఘటనలను ధైర్యంగా న్యాయస్థానం దృష్టికి తీసుకురావాలని అన్నారు. తగాదాలకు దూరంగా ఉండాలని, మంచి ప్రవర్తనలతో మెలగాలని, చేడు వ్యాసనాలకు బానిస కాకూడదని విద్యార్థులకు సూచించారు. సెప్టెంబరు 9న జాతీయ లోక్‌అథాలత్ నిర్వహించనున్నామని, ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏపిపి రమేష్, బార్ అధ్యక్షులు విశ్వేశ్వరరావు, కార్యదర్శి పిండి వెంకటరావు, ఉపాధ్యక్షులు ఫుని, అనిల్‌రాజు, దేవరాజు, రజినీకుమార్, చంద్రశేఖర్, శ్యామ్, సూపరింటెండెంట్ పాణిగ్రాహి, మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్, తహశీల్దార్ మధుసూధనరావు, విద్యాశాఖాధికారి శ్రీనివాసరావు, ప్రభాకర్, ప్రిన్సిపల్ వెంకటర మోహన్, ఎస్.ఐ షేక్ వలీలతో పాటు కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

లోతుగెడ్డకు పలువురు అభినందనలు

విశాలాంధ్ర-కొత్తూరు : వైసీపీ అధిష్టానం ప్రకటించిన జిల్లా నూతన కార్యవర్గంలో కొత్తూరు వైస్ ఎంపీపీపీ, పాతపట్నం నియోజికవర్గం నాయకులు లోతుగెడ్డ తులసి వరప్రసాద్ నాయకుడు పార్టీ జిల్లా కోశాధికారి పదవి దక్కడం పట్ల కొత్తూరుకు చెందిన ఆ పార్టీ నాయకులు సమావేశమై తమ హర్షం వ్యక్తం చేశారు. కొత్తూరు సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ లోతుగెడ్డ లక్ష్మీనారాయణ నాయుడు అధ్వర్యంలో జరిగిన సమావేశం జరిగింది పాతపట్నం నియోజక వర్గంలో పార్టీ పటిష్టతకు అహర్నిశలు కృషి చేస్తూ సమస్యలపై స్పందిస్తున్న లోతుగెడ్డకు జిల్లా కార్యవర్గంలో సముచిత స్థానం కల్పించిన పార్టీ అధినేత సీఎం జగన్మోహన్‌రెడ్డికి, పార్టీ జిల్లా పెద్దలకు ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు రేగేటీ కన్నయ్యస్వామి, ఏల్.రాందూత, టీ.గోపి, వెంకటకృష్ణ తదితులున్నారు.

అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలి

- పార్టీ అభివృద్ధికి కృషి చేయాలి
- మంత్రి డా.సీదిరి

విశాలాంధ్ర-పలాస : వైసీపీ సీనియర్ నాయకులకు వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లాలో పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని రాష్ట్ర మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. వైసీపీ అధిష్టానం నియమించిన జిల్లా కార్యవర్గంలో పలాస నియోజకవర్గానికి చెందిన వైసీపీ సీనియర్ నాయకులు బడగల బల్లయ్య (ప్రధాన కార్యదర్శి), దున్న సత్యం, తామాడ సరస్వతి, కుర గౌడ్, దేవరకొండ షన్ముఖరావు (ఎగ్జిక్యూటివ్ సభ్యులు)లను, కార్యదర్శిగా దల్లి జానకిరావు, ఉపాధ్యక్షులు పాలిన శ్రీనివాసరావు, జిల్లా వాణిజ్య విభాగపు అధ్యక్షులుగా బెల్లాల శ్రీనివాసరావు, సాంస్కృతిక విభాగపు అధ్యక్షులుగా ఉప్పరపల్లి ఉదయ్‌కుమార్‌లకు స్థానం కల్పించ డంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శు క్రవారం మంత్రి క్యాంప్ కార్యాలయం ప్రగతి భవన్‌లో ఏర్పాటు చేసిన అభినందనల సభలో ఆయన మాట్లాడుతూ సీనియర్ నాయకులకు పార్టీ గురుతర బాధ్యతలను అప్పగించిందని, పార్టీలో కొత్త వారిని కలుపుకొని ముందుకు వెళ్లాలని, ఇది నిరంతర ప్రక్రియ అని అన్నారు. పార్టీలో ప్రతి ఒక్కరికి పదవులు రావని, కష్టపడే తత్వం ఉన్నవారికి అవి వరిస్తాయని అన్నారు. గతంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థి 17వేల పైచిలుకు ఓట్లతో ఓటమి పాలయ్యారని, 2019లో జరిగిన ఎన్నికల్లో తాను సుమారు 17వేల ఓట్లతో విజయం సాధించడం వెనుక పార్టీ కార్యకర్తల కృషి ఎంతో ఉందన్నారు. పలాస నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, గతంలో జిల్లా కార్యవర్గంలో పని చేసిన నాయకులకు పదవులు రాలేదని నిరాశ చెందాల్సిన అవసరం లేదని, భవిష్యత్‌లో మరెన్ని పదవులు వచ్చే అవకాశాలున్నాయని అన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు అందరం కలిసి కట్టుగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో పలాస కాశీబుగ్గ మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు, వైసీపీ సీనియర్ నాయకులు హనుమంతు వెంకటరావు లతో పాటు కార్యకర్తలు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులపై మంత్రి ధర్మాన సమీక్ష

విశాలాంధ్ర-శ్రీకాకుళం రూరల్: అరసవిల్లిలో చేపట్టనున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు సమీక్ష నిర్వహించారు. అరసవిల్లిలో మునిసిపల్ స్కూల్ కి ఆనుకొని ఉన్న 2.77 రెండెకరాల ప్రభుత్వ భూమిని ఎలినేషన్ ద్వారా కార్పోరేషన్ కి కేటాయించారు. ఈ మొత్తం స్థలాన్ని ప్రభుత్వ పెద్దలు నగర మున్సిపల్ కార్పొరేషన్-కు ఎలాట్ చేశారు. ఈ విషయమై సంబంధిత అధికారులతో రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ స్థల అభివృద్ధికి సంబంధించి తయారుచేసిన డిజైన్స్-ను సంబంధిత కన్సల్టెన్సీ ప్రతినిధులు మంత్రి ధర్మానకు చూపించి, ప్లానింగ్ ను వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన స్థలంలో ఓపెన్ థియేటర్,చిల్డ్రన్స్ ప్లే ఏరియా, యోగా థియేటర్, ఓపెన్ జిమ్, అలానే ఆ పక్కనే ఉన్న చెరువును కూడా అభివృద్ధి చేయాలని మంత్రి ధర్మాన సూచించారు. ఇందుకు సంబంధించిన ప్రణాళిక సిద్ధం చేయమని మంత్రి ధర్మాన మున్సిపల్ అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ చల్లా ఓబులేసు,మున్సిపల్ ఇంజినీర్ గంగాధర్, వైసీపీ నాయకులు చల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పంచాయతీ నిధులతో బస్‌షెల్టర్‌కు శంకుస్థాపన

విశాలాంధ్ర-సోంపేట : ఈ మండలం మామిడిపల్లి పంచాయతీలో చిన్నమామిడిపల్లి గ్రామంవద్ద సర్పంచ్ పాతిన శేషగిరి ఆధ్వర్యంలో శుక్రవారం గ్రామపంచాయతీ నిధులతో బస్‌షెల్టర్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ దున్న మాధవరావు, గ్రామపెద్దలు పాల్గొని మాట్లాడారు. ఎన్నో ఏళ్లుగా బస్‌షెల్టర్ నిర్మాణానికి ఎంతో మంది హామీలిచ్చినప్పటికి ఇప్పటికీ కార్యరూపం దాల్చడం గొప్ప విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో దున్న దుర్యోధన, గొరకల లింగరాజు, గూడ తాతారావు, పాతిన మాధవ రావు, సాహుకారి జానకిరాం, పాతిని నాని తదితరులు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా రాణిస్తేనే దేశం అభివృద్ధి : ఏపీఎం పైడి కూర్మారావు

విశాలాంధ్ర-ఆమదాలవలస : మహిళలు ఐకమత్యంగా ఉండి, ఆర్థికంగా రాణిస్తేనే, మీ కుటుంబ అభివృద్ధితోపాటు, దేశాభివృద్ధి సాధ్యపడు తుందని వైయస్సార్ క్రాంతి పదం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. శు క్రవారం అక్కివరం పంచాయితీ గోపీనగర్ పరిధిలోగల మాస య్యపేట లో మండల సమాఖ్య కోశాధికారి రేణుకా ఆధ్వర్యంలో నిర్వహించిన రైతు ఉత్పత్తి దారుల సంఘాల సమావేశంలో పాల్గొ ని మాట్లాడారు. ప్రతి మహిళా రైతు కుటుంబం కూడా పెరటి తోటలు వేసి అందులో ఎలాంటి రసాయనాలు ఉప యోగించకుండా ,ఆకుకూరలు, కాయగూ రలు తో పాటు మునగ, కరివేపాకు, బొప్పాయి, జామ తదితర చెట్లను పెంచుకోవాలని సూచించారు. గ్రామాలలో మహిళలందరికీ అవగాహన కల్పించి, అందరి ఆరోగ్యానికి అవసరమైన చిరు ధాన్యాల ఉత్పత్తికి ప్రణాళికలు తయారు చేసుకొని రాగులు ,జొన్నలు, గంటిలు, సామలు, ఉలవలు మొదలగు విత్తనాలను సమకూర్చుకొని పండించాలని కోరారు. మీ రైతు సంఘాలకు చిరుధాన్యాలు, తోట పంటల ఉత్పాదకత కు అవసరమైన పనిముట్లు, పెట్టుబడి సహాయానికి మండల రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య ఆధీనంలో బ్యాంకుల ద్వారా అవసరమైన రుణ సౌకర్యం కల్పించబడు తున్నట్లు వివ రించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సంఘం ప్రతినిధులు పద్మ, కుమారి పాటు వి.వో.ఏ. రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన సౌదీ బాధితులు

విశాలాంధ్ర-వజ్రపుకొత్తూరు : జీవనోపాధి కోసం సౌదీ అరేబియా వెళ్లి అక్కడ పనులు లేక చిక్కుకున్న మండలం మంచినీళ్లపేట గ్రామానికి చెందిన బాధితులు శుక్రవారం శ్రీకాకుళం లో ఎంపీ కె. రామ్మోహన్ నాయుడు ని కలిసి ధన్యవాదములు తెలిపారు. మంచినీళ్లపేట గ్రామానికి చెందిన పుక్కళ్ల రామ్మూర్తి, కె. నరసింహులు, గణేష్, బుంగ సంతోష్, ఆర్. దానయ్య, సోడిపిల్లి రాకీ, చెక్క ఎర్రన్న తదితర 20 మంది మత్స్యకారులు ఉపాధి కోసం సౌదీ వెళ్లి అక్కడ పనులు లేక స్వదేశానిక వచ్చే మార్గం లేక ఇబ్బందులు పడ్డారు. ఈ విషయాన్ని మాజీ టీడీపీ అధ్యక్షుడు గోవింద పాపారావు, మంచినీళ్లపేట మాజీ సర్పంచ్ గుళ్ల చిన్నారావు లు ఢిల్లీ వెళ్లి విషయాన్ని ఎంపీ రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎంపీ స్పందిస్తూ భారత విదేశాంగ మంత్రి ని కలిసి స్వదేశానికి తీసుకొని రావడానికి చేసిన కృషి ఫలించి క్షేమంగా స్వగ్రామానికి చేరుకున్నారు. శ్రీకాకుళం వెళ్లి ఎంపీ ని కలిసి సౌదీ బాధితులు ఆయనకు ధన్యవాదములు తెలిపారు.

కేంద్ర మంత్రి ధర్మేంద్రను కలిసిన ఎమ్మెల్సీ దువ్వాడ

విశాలాంధ్ర సంతబొమ్మాళి : కేంద్ర విద్య మరియు నైపుణ్యాభివృద్ధి శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి సమక్షంలో, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్‌రావు మర్యాదపూర్వకంగా కలిసారు. సాలూరు నియోజకవర్గంలో గిరిజన విశ్వవిద్యాలయం శంకుస్థాపన కార్యక్రమానికి వచ్చిన కేంద్రమంత్రికి పుష్పగుచ్ఛం అందజేశారు.

నాలుగు రోజులు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విశాలాంధ్ర-పలాస : పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా నూతనంగా విద్యుత్ లైన్లు ఏర్పాటుకు శనివారం నుంచి మంగళవారం వరకు ప్రతీ రోజు ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని కాశీబుగ్గ విద్యుత్ శాఖ డిఇ జి ప్రసాదరావు ప్రకటనలో తెలిపారు. కాశీబుగ్గ లో నిత్యనందనగర్, ఆంధ్ర బ్యాంక్ రోడ్డు, గాంధీనగర్, న్యూ కాలనీ, దుర్గ మండపం పోలీస్ స్టేషన్ , కాశీబుగ్గ హై స్కూల్, ఎస్ఎండి పార్లర్, ఫిష్ మార్కెట్, తిలక నగర్, డిగ్రీ కళాశాల రోడ్, పూజారి వీధి, గుణేశ్వర నగర్, న్యూ కాలనీ, హరి శంకర్ సినిమా హాల్ తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు. సమస్యను దృష్టిలో పెట్టుకొని పట్టణ ప్రజలు సహకరించాలని కోరారు.

న్యాయవాది దాతృత్వం... టేబుల్లు, కుర్చీల బహూకరణ

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్ : సీనియర్ న్యాయవాది గెద్దాపు శ్రీకృష్ణ ప్రసాద్ శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ కు రూ 50 వేల విలువైన టేబుల్లు, కుర్చీలు బహూకరిచారు. శ్రీకాకుళం జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ ఎన్ని సూర్యారావు సమక్షంలో శుక్ర వారం ఆయన వీటిని అప్పగించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

ఈదురుగాలులకు కూలిన విద్యుత్ స్తంభం

యుద్ధ ప్రాతిపదికన పనులు. ఏఈ శివకుమార్

విశాలాంధ్ర-సంతబొమ్మాళి : శుక్రవారం సాయంత్రం ఈదురు ఈదురుగాలులకు బోరుభద్ర పెద్ద చెరువువద్ద ఉన్న విద్యుత్ స్తంభం వాలిపోయింది. దీంతో బోరుభద్ర సబ్‌స్టేషన్కు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వాలిపోయిన విద్యుత్ స్తంభం ద్వారా, బోరుబద్ర సబ్‌స్టేషన్‌కు సబ్ స్టేషన్ కు విద్యుత్ సరఫరా అవుతుంది. సరఫరా జరిగే స్తంభం ఈదురు గాలులకు కూలిపోవడంతో స్తంభాలకున్న క్రాసారాలు విద్యుత్ మెటీరియల్ పాడవడంతో విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలిగిందని సంబంధిత అధికారులు తెలిపారు. దీంతో విద్యుత్ అధికారులు రంగంలోకి దిగి, పొక్లెయిన్‌తో స్తంభాలను సరిచేసి విద్యుత్ సరఫరాచేసే కార్యక్రమాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపడుతున్నట్లు ఏఈ శివకుమార్ తెలిపారు.

బిందెశ్వర్ ప్రసాద్ మండల్ సేవలు హర్షణీయం

ఓబీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ సనపల అన్నాజీరావు

విశాలాంధ్ర-ఆమదాలవలస : వెనుకబడిన తరగతుల సంక్షేమానికి బిందెశ్వర్ ప్రసాద్ మండల్ పాటుపడ్డారని ఓబీసీ రాష్ట్ర కోఆర్డినేటర్ సనపల అన్నాజీ రావు అన్నారు. శుక్రవారం బిపి మండల్ 105వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళుల ర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓబిసి నేషనల్ చైర్మన్ కెప్టెన్ అజయ్ సింగ్ యాదవ, రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు ఓబీసీ రాష్ట్ర ప్రెసిడెంట్ మూల వెంకట్రావు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. బీపీ మండల్ ఓబిసి కమిషన చైర్మన్‌గా బీహార్ ముఖ్యమంత్రిగా, భారతదేశ పార్లమెంట్ సభ్యులుగా ఎన్నో ఉన్నత పదవులు అలంక రించారని, అలాగే బీసీ కమిషన్కు చైర్మన్ గా ఉంటూ బీసీల సంక్షేమానికి పెద్ద పేట వేసారని అన్నారు. ఈ కార్యక్రమంలో పి. శివ, వాసు, రమేష్, లఖినేని సునీల్, శ్రీనివాసరావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

బీసీల ఆశాజ్యోతి బీపీ మండల్

- బహుజన నేత డా. కంఠ వేణు
- బీపీ మండల్ నివేదిక యధాతథంగా అమలు చేయాలి
- బీసీల సంక్షేమంపై నిర్లక్ష్యం తగదు
- బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పిట్టా చంద్రపతిరావు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: వెనుకబడిన వర్గాలుగా పిలువబడే బీసీ లంతా ఆర్థికంగా అభివృద్ధి సాధించాలని, రాజ్యాంగం ద్వారా సంక్రమించిన ఫలాలు వారికి చేరువ కావాలని భారత ఓబీసీ కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించిన బీపీ మండల్ ఎంతగానో కృషి చేసారని బహుజన నేత డా. కంఠ వేణు స్పష్టం చేశారు. ఈమేరకు శుక్రవారం స్థానిక కలెక్టరేట్ సమీపంలో మహాత్మ జ్యోతిరావ్‌పూలే పార్క్ వద్ద బీపీ మండల్ 125వ జయంతిని పురస్కరించుకుని మండల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్టా చంద్రపతిరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విగ్రహ బహుకరణ కర్తలు కలగ జగదీష్, కుమార్తె కలగ లిజీయాదవ్‌లు ముఖ్య అతిథులుగా బీపీ మండల్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్నారు. బహుజన నేత డా. కంఠ వేణు మాట్లాడుతూ బీసీల ఆశాజ్యోతి బీపీ మండల్ అంటూ కొనియాడారు. జాతీయ బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడు పిట్టా చంద్రపతిరావు మాట్లాడుతూ 75 సంవత్సరాల స్వాతంత్ర్యం గడిచినా బీసీలకు మాత్రం మేలు జరగలేదని, ప్రభుత్వాలు ఎన్ని మారినా బీసీలకు అభివృద్ధి జరగలేదని ఆవేదన వ్యక్తంచేసారు. దేశ ప్రధాని నరేంద్ర మోడీ చంద్రయాన్ విజయవంతం చేయడంలో సహకరించినట్టుగా బీసీల అభివృద్ధికి మాత్రం కేంద్ర ప్రభుత్వం కృషి చేయలేదని, అన్ని ప్రభుత్వాలు బీసీలకు అన్యాయం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 56 శాతం ఉన్న బీసీలకు నేటికీ రాజ్యాధికారం దక్కలేదని ఆవేదన వ్యక్తంచేసారు. చట్టసభల్లో 50 శాతం రాజ్యాధికారం కల్పించాలని కోరారు. పలు ప్రభుత్వాలు, పాలకులు బీసీల సమగ్రాభివృద్ధికి బీపీ మండల్ రూపొందించిన నివేదికను లాకర్‌లో పెట్టి భద్రపరిచారని ప్రధాని మోడీ పాలనలోన్కైనా సదరు నివేదికను యధాతథంగా అమలుచేసి బీసీల అభ్యున్నతికి రాజ్యాధికారానికి కృషి చేయాలని, క్రిమిలేయర్‌ను పూర్తిగా రద్దుచేయాలని చంద్రపతిరావు కోరారు. ఈ కార్యక్రమం లో కాయితీ వెంకటరమణ, గద్దెబోయన క్రిష్ణ, కర్రీ రంగాజీ దేవ్, దామోదర కేశవ, తిప్పాన గాంధీ, పేరూరి శ్రీనివాసరావు, ఇప్పిలి చిన్నారావు, మంగరాజు, యాదం దాలినాయుడు, కాళ్ళ వెంకట రావు, వంజరాపు కసవయ్య, పాలిన ప్రసాదరావు, కారగాన భారతి, అనంత రావు అల్లం శెట్టి హరిబాబు, వద్ది పరమేశ్వరరావు, నిద్రబంగి సత్యనారాయణ తదితర బీసీ నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక వరలక్ష్మి వ్రతం



విశాలాంధ్ర-కవిటి : మండలంలోని ప్రగడపుట్టుగ రామాలయ ప్రాంగణంలో సామూహిక వరలక్ష్మి వ్రతం గ్రామస్తుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వేకువ జామునుండి లక్ష్మీదేవికి అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అంగదస్వామిచే సామూహిక వరలక్ష్మి వ్రతాలు చేపట్టారు. అనంతరం పండి సత్యనారాయణ, కృష్ణారావు సోదరులు ఆర్థిక సహకారంతో భక్తులకు నారాయణ సేవను జరిపించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సత్యసాయి పెద్ద మందిరంలో శ్రీ వరలక్ష్మీ వ్రతాలు'

విశాలాంధ్ర-అరసవల్లి: ఓం శ్రీ సాయిరాం భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి దివ్య అనుగ్రహ ఆశీస్సులతో శుక్రవారం శ్రీకాకుళం పెద్ద మందిరం లో శ్రీ వరలక్ష్మీ వ్రతాలు 180 మంది మహిళా మణులతో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వ్రతాలకు సరిపడా వస్తు సామాగ్రి మరియు వరలక్ష్మి దేవి ప్రతిమ కూడా మందిరం వారు సమకూర్చారు. భారత జాతి మహిళా మణుల సౌభాగ్యం కోసం మరియు విశ్వ కళ్యాణం కొరకు ఈ వ్రతాలు నిర్వహించినట్లు పెద్ద మందిరం కన్వీనర్ కంభ మురళీకృష్ణ తెలియజేశారు. ఈ పవిత్ర కార్యక్రమంలో వరం చారిటబుల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్ట్ అందవరపు ప్రసాద్ దంపతులు, రాష్ట్ర అధ్యక్షులు వారి సతీమణి కమల త్రివేణి, జిల్లా పూర్వపు అధ్యక్షులు గంగుల రమణబాబు, జిల్లా సత్యసాయి సేవా సంస్థల సమన్వయకర్త సూర రామచంద్రరావు, డాక్టర్ ఎల్ సోమేశ్వరరావు, భూలక్ష్మి, సత్యవతి, మధు, తంగుడు ప్రసాద్, నాగభూషణం మాస్టారు, బోయిన్ నరసింహమూర్తి, గుర్ల భాను మూర్తి మరియు భక్తులు పాల్గొన్నారు.

పిడుగు పడి రైతు మృతి

విశాలాంధ్ర-రణస్థలం: పొలం పనులు చేస్తుండగా పిడుగుపడడంతో ఓ రైతు మృతి చెందాడు. రణస్థలం మండలం వేల్పురాయి గ్రామంలో శుక్రవారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి. వేల్పురాయి గ్రామానికి చెందిన మహంతి రామస్వామి నాయుడు (65) గ్రామ సమీపంలో తన పొలంలో వరినాట్లు వ్యవసాయ కూలీలతో వేయిస్తున్నారు. రైతు రామస్వామి నాయుడు కుడా కూలీలతో సమానంగా మరికొంత దూరంలో కలసి వరినాట్లు వేస్తున్నారు. సాయంత్రం 5 గంటల సమయంలో వర్షం మొదలైంది. వర్షంతో పాటు ఒక్కసారిగా మెరుపులతో కూడిన పిడుగులు పడడంతో పిడుగు రైతు రామస్వామి నాయుడుపై పడడంతో అపస్మారకస్థితికి వెళ్లాడు. వెంటనే పొలంలో పనిచేస్తున్న కూలీలు దగ్గరకు వచ్చి చూసేసరికి మృతి చెందారు. భర్త మృతిచెంద డంతో భార్య కాంతమ్మ రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టిం చింది. అతడికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నాడు. ఈ విషయం తెలుసుకున్న స్థానిక జె.ఆర్.పురం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామా జరిపి మృతదేహానికి పోస్ట్ మార్టం నిమిత్తం శ్రీకాకుళం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పలు గ్రామాలకు విద్యుత్ అంతరాయం

విశాలాంధ్ర-పాతపట్నం: శనివారం అనగా 26న ఉదయం 10గంటల నుండి సాయంత్రం 5గంటల వరకు పాతపట్నం విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో పవర్ ట్రాన్స్ఫార్మర్స్ మార్చుట కొరకు విద్యుత్ నిలుపుదల చేయబడునని ఎక్జిక్యూటివ్ ఇంజనీర్, టెక్కలి వి ఏ రాజశేఖర్ తెలియజేశారు. పాతపట్నం, కొరసవాడ, కాగువాడ, తిడ్డిమి, చంగుడి, సరాలి, రంకిని తదితర గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతున్నందున పై గ్రామాల్లో ఉన్న విద్యుత్ వినియోగదారులు సహకరించాలని శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.

ఐటిఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

విశాలాంధ్ర - ఎచ్చర్ల : ప్రభుత్వ ప్రైవేటు ఐటిఐ లో మిగిలిన సీట్లను మూడో విడతలో భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు అడ్మిషన్ కన్వీనర్ ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపాల్ సుధాకర్ రావు తెలిపారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 27వ తేదీలోగా ఐటిఐ డాట్ ఏపీ డాట్ జీవో వి డాట్ ఇన్ వెబ్సైట్లో ఏఐటిఐ లో చేరాలనుకుంటున్నారో ఆ ఐ టి ఐ కు ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ ఫారం తో పాటు వారి ఒరిజినల్ సర్టిఫికెట్లను ఏదైనా ప్రభుత్వ ఐటిఐ లో ఈ నెల 28వ తేదీలోగా పరిశీలన జరుపుకోవాలన్నారు ప్రభుత్వ ఐటిఐ లో ఈనెల 30న ప్రైవేటు ఐటిఐ లో ఈనెల 31న కౌన్సిలింగ్ నిర్వహిస్తామన్నారు.

జిల్లా అభివృద్ధి దార్శనికుడు.. బొడ్డేపల్లి

నేడు పలాస, సోంపేటలలో విగ్రహావిష్కరణలు

విశాలాంధ్ర-పలాస: జిల్లా అభివృద్ధి దార్శనికుడు, బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి , వంశధార ప్రాజెక్టు రూపశిల్పి, మొట్టమొదట లోకసభ నుంచి 7వ లోకసభ వరకు అప్రతిహతంగా జైత్ర యాత్ర కొనసాగిస్తూ పార్లమెంటుకు ఎన్నుకోబడి జిల్లాకు ఉత్తరాంధ్రకు రాష్ట్రానికి తన సేవలతో వన్నె తెచ్చిన దివంగత నేత బొడ్డేపల్లి రాజగోపాలరావు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆయన శతజయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. 1923 మార్చి 12న సీతారామస్వామి, అన్నపూర్ణలకు జన్మించిన బొడ్డేపల్లి తన ప్రాథమిక విద్యను ఆమదావలసలో ఉన్నత విద్యాను విజయనగరం మహారాజ్ డిగ్రీ కళాశాలలో పూర్తి చేశారు. విద్యార్థి దశలో తొలి తరం కమ్యూనిస్టు నాయకులు పుచ్చలపల్లి సుందరయ్య, జొన్నలగడ్డ రామలింగయ్య వంటి ఉద్దండులచే 1942లో విజయనగరం ఎం.ఆర్ కళాశాల ఆంధ్రా మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థి యువజన సంఘాల సభ్యుల్లో బొడ్డేపల్లి ఒకరు. బొడ్డేపల్లికి భార్య సీతమ్మ, ఇద్దరు కుమారులు చిట్టిబాబు, సీతారామస్వామి, కుమార్తె అన్నపూర్ణలు. స్వాతంత్ర్యం అనంతరం 1952లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో శ్రీకాకుళం పార్లమెంటు స్థానానికి దివంగత ప్రధాని జవహార్‌లాల్ నెహ్రూకు అత్యంత సన్నిహితుడు విజయనగరం మహారాజు గజపతి వంశస్తుడు పి.ఎల్.ఎన్.రాజు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయగా ఆయనపై పోటీకి స్వాతంత్ర అభ్యర్థిగా కేవలం 27 సంవత్సరాల వయస్సులోనే బొడ్డేపల్లి నిలిచి అనుహ్యాంగా సంచలన విజయం సాధించడంతో దేశంలో గల అప్పటి నాయకుల మదిలో మెదిలారు. అయితే నెహ్రూ తన సన్నిహితుడు ఓటమి పాలవ్వడంతో జీర్ణించుకోలేకపోయారు. పార్లమెంటు హాలులో అతిరథుల సమక్షంలో బొడ్డేపల్లి ఎం.పిగా ప్రమాణం చేస్తున్న సమయంలో నెహ్రూ బొడ్డేపల్లిని తదేకగంగా చూస్తూ ఉండిపోయారని అప్పట్లో చెప్పుకునే వారు. యుక్త వయస్సులోనే స్వాతంత్ర అభ్యర్థిగా గెలవడంతో పాటు తన సన్నిహితుడుని ఓడించి చరిత్ర సృష్టించడం జరిగింది. తొలినాళ్లల్లో నిర్వహించిన పార్లమెంటు సభ్యుల క్రికెట్ పోటీల్లో ఒక బృందంకు ఎం.పి బొడ్డేపల్లి నాయకత్వం వహించి విజయం సాధించినప్పుడు స్వయంగా క్రీడను తిలకించిన నెహ్రూ ముచ్చట పడి బొడ్డేపల్లిని తన కార్యాలయానికి పిలిపించుకొని " మిస్టర్ హెండ్‌సమ్ అని" సంబోధిస్తూ కాంగ్రెస్ పార్టీలో చేరమని అహ్వానించారు. నెహ్రూపై ఉన్న గౌరవంతో కాంగ్రెస్ పార్టీలో చేరి తుది శ్వాస వరకు ఆ పార్టీలోనే బొడ్డేపల్లి కొనసాగారు. ఈయన 6సార్లు 32 సంవత్సరాలు ఎం.పిగా కొనసాగి దివంగత ప్రధానులు నెహ్రూ, గుల్జారిలాల్ నందా బహుదూర్ శాస్త్రీ, ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ పాలన వరకు కొనసాగారు. ఇందిరా, రాజీవ్‌లు బొడ్డేపల్లిని 'రావ్‌జీ'గా సంబోధించి గౌరవించే వారు. నిలువెత్తు రూపం 6 అడుగుల ఆజాను బాహుడైన బొడ్డేపల్లి ఎం.పిగా జిల్లాలో వంశధార ప్రాజెక్టు రూపకల్పన చేయడం ఆ ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వం ఆయన పేరు పెట్టడం జరిగింది. అంతేకాకుండా అప్పట్లో దేశం మొత్తం మీద 4 సహకార పరిశ్రమలు ప్రారంభమైతే అందులో ఒకటి జిల్లాలో ఏర్పాటు చేశారు. జిల్లాను వ్యవసాయ రంగ పారిశ్రామిక పరంగా ఎంతో కృషి చేసిన బొడ్డేపల్లి ఆమదాలవలస, శ్రీకాకుళంలో పారిశ్రామిక వాడలను స్థాపించారు. రాగోలు, చింతాడ, బారువల్లో వ్యవసాయ పరిశోధన కేంద్రాలు ఏర్పాటు చేశారు. పొందూరులో జూట్ మిల్లులు, నూనె మిల్లులు ఏర్పాటు చేసి చేనేత పరిశ్రమలను ప్రోత్సహించారు. టెలికాం

రంగం అభివృద్ధికి కృషి చేశారు. అలాగే ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో గరివిడి వద్ద ఫెరోల్లాస్ పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. ఉత్తరాంధ్రలో వెనుకబడిన వర్గాలను బి.సిలో కలపడానికి ప్రధాన భూమిక పోషించారు. ఉత్తరాంధ్రలో వివిధ కూలాలకు ప్రాతినిధ్యం లేకపోవడంతో ఆయనే స్వయంగా కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లారు. ప్రస్తుత బి.సి వర్గాలు పొందుతున్న సౌకర్యాలు ఆయన చూపిన చొరవేనని ఇప్పటికీ చెప్పుకుంటున్నారు. జిల్లాలో తన కులంను కాకుండా మిగిలిన అన్ని కులాల నాయకులను బొడ్డేపల్లి ప్రోత్సహించే వారు. పాలకొండకు చెందిన పాలవలస సంఘంనాయుడు, ఆయన రుక్మిణమ్మను ప్రోత్సహించగా ప్రస్తుతం ఆ కుటుంబానికి చెందిన మూడో తరం రాజకీయాల్లో కొనసాగుతున్నారు. బొబ్బిలికి చెందిన వాసిరెడ్డి క్రిష్ణమూర్తినాయుడు, శ్రీకాకుళంనకు చెందిన అందవరపు తవిటయ్య, నరసన్నపేటకు చెందిన సిమ్మ జగన్నాథం, బగ్గు సరోజనమ్మ, హరిశ్చంద్రపురంనకు చెందిన కె.ఎ.ఎస్ భుక్తా ఇలా కులాలను, వర్గాలను అతీతంగా అభివృద్ధికి పాట పడిన రాజనీతిజ్ఞుడు బొడ్డేపల్లి. జిల్లాలో ఉన్న కళింగుల బి.సి-ఎ కేటగిరిలో ఉండే విధంగా చర్యలు తీసుకోవడంతో నేడు వారు ఆర్థిక సామాజిక పరంగా అభివృద్ధి చెందారని చెప్పుకోవచ్చు.

నేడు పలాస, సోంపేటల్లో విగ్రహావిష్కరణలు : బొడ్డేపల్లి శతజయంతి సందర్భంగా జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పలాస, సోంపేటల్లో బొడ్డేపల్లి విగ్రహాలు ఏర్పాటుకు చురుకుగా సన్నహాలు జరుగుతున్నాయి. ఈ నెల 26వ తేదీన 10 గంటలకు పలాసలో, 3 గంటలకు సోంపేటలో రాష్ట్ర శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం విగ్రహాలను ఆవిష్కరిస్తారని నిర్వహకులు తెలిపారు.

కార్నియల్ అంధులకు నేత్రదానంతోనే వెలుగు ప్రసాదించవచ్చు

- జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డా. బి మీనాక్షి

విశాలాంధ్ర-శ్రీకాకుళం: కార్నియల్ అంధులకు నేత్రదానంతోనే వెలుగు ప్రసాదించవచ్చు అని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డా. బి మీనాక్షి అన్నారు. 38 వ జాతీయ నేత్రదాన పక్షోత్సవాలు సందర్భంగా ఈనెల 25 నుండి సెప్టెంబరు 8 వరకు జిల్లాలో నేత్రదానంపై ప్రజలకు అవగాహన కల్పించి చైతన్య పరిచి మరింత మంది నేత్రదానికి ముందుకు వచ్చేటట్లు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్నియల్ అంధులలో చూపును నేత్రదాతల నుంచి సేకరించిన కార్నియా మార్పిడి ద్వారా మాత్రమే ప్రసాదించవచ్చునని, ప్రత్యామ్నాయం లేదు కాబట్టి ప్రజలందరూ నేత్రదానం పట్ల అవగాహన కలిగి ఎవరైనా తమ కుటుంబంలో మరణించిన తర్వాత వారి బంధువులు నేత్రదానానికై అంగీకరించి సమాచారాన్ని నేత్ర సేకరణ కేంద్రానికి వెంటనే తెలియపరచి ఇద్దరూ కార్నియల్ అందుల జీవితాల్లో వెలుగు నింపచ్చున్నారు. జిల్లాలో పారామెడికల్ ఆప్తాల్మిక్ అధికారుల ద్వారా నిర్వహిస్తున్న వైయస్సార్ కంటి వెలుగు శిబిరాల్లో నేత్రదానంపై విస్తృతంగా అవగాహన సదస్సులు, ర్యాలీల కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు.

అన్ని దానాల్లోను అన్నదానం గొప్పది

- 124వ రోజు అన్నా క్యాంటీన్ కొనసాగింపు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: అన్ని దానాల్లోనూ అన్నదానం గొప్పదని, అన్నార్తుల కోసమే అన్నాక్యాంటీను ఏర్పాటు చేసి పేదల ఆకలి తీరుస్తామని టిడిపి నియోజకవర్గ యువ నాయకులు, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచ్ ల సంఘ అధ్యక్షులు గొండు శంకర్ అన్నారు. టీడీపీ యువనాయకులు, ఉమ్మడి శ్రీకాకుళం జిల్లా సర్పంచ్‌ల సంఘ అధ్యక్షులు గొండు శంకర్ ఆధ్వర్యంలో నడుస్తున్న అన్నా క్యాంటీన్ సోమవారం 124వ రోజు కొనసాగించారు. అలాగే పాత బస్టాండ్ లో 124వ, రోజు కూడా అన్న క్యాంటీన్ ను నిర్వహించారు. అలాగే మొబైల్ వ్యాన్ల ద్వారా నగరంలో పలుకూడళ్లలో పేదలకు నిరాశ్రయులకు భోజనాలను అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాల పార్టీ తెలుగుదేశం పార్టీ, మళ్ళీ తెలుగుదేశం ప్రభుత్వం 2024లో అధికారంలోకి వస్తుందన్నారు. 2024 లో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు మరలా అన్నా క్యాంటీన్లను కొనసాగిస్తారని చెప్పారు. అన్న క్యాంటీన్ ల ద్వారా ప్రతిరోజు జిల్లాలో వేలాది మంది కడుపు నింపుకునే వారన్నారు. చంద్రబాబునాయుడు మరలా ముఖ్యమంత్రిగా రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలకు అనుకూలమైన పాలన అందిస్తారని, నేటి వైస్సార్సీపీ పాలనలో రాష్ట్రంలో పెరిగిన నిత్యావసరధరలతో పేదల, సామాన్యుల బతుకులు చిన్నాభిన్నమైనవని ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు 550 మంది అన్నార్తులు భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మాజీ కౌన్సలర్ అంబటి లక్ష్మి రాజ్యం, రావుల గాంధీ, రమణ, నరసింహ, ఎ, ఈశ్వర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగానికి అండగా వైసీపీ ప్రభుత్వం

విశాలాంధ్ర-పలాస : వ్యవసాయ రంగం అభివృద్ధి కోసం వైసీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని, రైతులు ఉపయోగించుకోవాలని పలాస పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి అన్నారు. పలాస పిఎసిఎస్ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఖరీఫ్‌లో భాగంగా రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచామని, శనివారం ఉదయం 9 గంటల నుంచి బ్రాహ్మణతర్ల పిఎసిఎస్ గిడ్డంగి వద్ద పంపిణీ చేస్తామని చెప్పారు. అనంతరం రైతు భరోసా కేంద్రం ద్వారా ఎరువులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఒకవేళ రైతు భరోసా కేంద్రాలవద్ద ఎరువులు లభ్యం కానీ ఎడల రైతులు తమ ఆధార్ కార్డు తీసుకువస్తే బయో మెట్రిక్ విధానం ద్వారా ఎరువులు అందచేస్తా మన్నారు. ఒక రైతుకు రెండు బస్తాలు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పంటలో జిగురుపూసిన అట్టలు పెడుతున్న రైతులు

విశాలాంధ్ర-ఆమదాలవలస: మండలం చేపేనపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతుల తో ఐదు ఎకరాల విస్తీర్ణంలో పంటలో జిగురుపూసిన పసుపు రంగు అట్టలను మరియు పక్షి స్థావరాలను పెట్టించారు. ఈ సందర్భంగా యూనిట్ ఇన్‌ఛార్జి నక్క చిరంజీవి మాట్లాడుతూ వీటిని పొలాల్లో పెట్టుకోవడం వలన పంటలో పచ్చ దోమ ఉధృతి తెలుస్తుందన్నారు. దీనికి ప్రకృతి సేద్యంలో నివారణ చర్యలను చేసుకోవచ్చునని అన్నారు. అలాగే సిబ్బంది డిజిటల్ సురేష్ మాట్లాడుతూ వరి సాగులో మొదటి దశ నుండి చివరి దశ వరకు ఖచ్చితమైన రాజీలేని సూత్రాలను పాటిస్తే అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. గ్రామంలో రైతులచేత పూర్తిగా ప్రకృతి వ్యవసాయాన్ని సాగు చేసేలా క్షేత్ర స్థాయిలో మా సిబ్బంది పని చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది తిరుపతిరావు, లక్ష్మి, కృష్ణవేణి, జానికిరామ్ తదితరులు పాల్గొన్నారు.

వరలక్ష్మి పూజల్లో విశేషంగా పాల్గొన్న మహిళా మణులు

విశాలాంధ్ర-పాతపట్నం: శ్రావణమాసం వచ్చిందంటే వరలక్ష్మి పూజలో మహిళలా మణులు నిమగ్నమై ఉంటారు.ఈఏడాది అదిక శ్రావణ మాసం రావటంతో నిజ శ్రావణం కై కొంత ఎదురు చూడాల్సి వచ్చింది.అయితే ఆగస్టు 25 రెండవ శుక్రవారం కావటం తో మహిళలు శుక్రవారం వరలక్ష్మీ వ్రతం పూజ లో నిమగ్నమై ఉన్నారు.వేకువ జామునుంచే అమ్మవారికి విశేష పూజలు కుంకుమార్చనలు చేసి తోటి మహిళలకు వాయనాలు ఇవ్వటం తో రోజంతా బిజీగా గడిపారు. ఏది ఏమైనప్పటికీ మహిళలు పూజలు నూతన వస్త్రాధారణ వంటి వాటి తో శుక్రవారం కళకళలాడారు.

ఆసక్తికరంగా పలాస రాజకీయాలు

వైసీపీ, టీడీపీల మధ్య రగులుతున్న రాజకీయ వేడి

విశాలాంధ్ర-పలాస: శ్రీకాకుళం పార్లమెంటరీ నియోజకవర్గం పరిధిలో ఉన్న పలాస నియోజకవర్గానికి రాజకీయాలు రోజురోజుకు ఆసక్తికరంగా మారుతున్నాయి. ఎత్తుగడలతో రాజకీయాలు వైసీపీ, టీడీపీ పార్టీలు నడుపుతున్నాయి. ఈ రెండు పార్టీలు మధ్య ఎన్నికల నాటికి (మరో ఆరు నెలల కాలంలో ఎన్నికలు జరిగే సమయానికి) హెరాహెరీగా తలపడే అవకాశాలున్నట్లు పరిశీలకులు భావిస్తున్నారు. రాష్ట్ర మత్స్య, పశుసంవర్ధక శాఖా మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు తనకున్న మేధాశక్తితో పాటు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్మోహనరెడ్డి చరిస్మా, వైసీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో రాజకీయంగా దూకుడు ప్రదర్శిస్తున్నారు. అయితే ఆయన కోటరీ ఇస్తున్న తప్పుడు సలహాలతో డాక్టర్ సీదిరికి రాజకీయంగా కొంత మేరకు నష్టం వాటిల్లే అవకాశాలున్నాయని పరిశీలకులు పేర్కొంటున్నారు. మంత్రి డా.సీదిరి నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్న అసమ్మతి వర్గం ఆయనను రాజకీయంగా దెబ్బ తీయాలన్న ఆలోచనతో ఉన్నట్లు సమాచారం. ఇకపోతే 2011 నుంచి వైసీపీ జెండా పట్టుకొని తిరిగిన పూర్వపు కేడర్‌ను వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నాలుగేళ్లకు పైగా పట్టించుకోక గుర్తింపునకు నోచుకోకపోవడంతో వారు పార్టీకి దూరంగా ఉన్నారు. అయితే ఇటువంటి శ్రేణులు పార్టీ మారే ఆలోచన మాత్రం బయటకు ఎక్కడ కనిపించకపోవడం విశేషం. ఇమేజ్ డాక్టర్ సీదిరిని డామేజ్ చేసేందుకు కొంతమంది కాచుకొని ఉన్నారని, ఎన్నికల సమయంలో లబ్ధి పొంది ఆయనకు దూరంగా వెళ్లే ప్రయత్నాలు పలువురు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఇక టీడీపీ విషయానికి వస్తే మండల పరిషత్, జెడ్‌పిటిసి, సర్పంచ్ ఎన్నికల్లో పలాస నియోజకవర్గంలో అభ్యర్థులు పోటీ చేయపోవడంతో పల్లెల్లో టీడీపీకి పార్టీ పరంగా పట్టు దొరకడం లేదు. క్షేత్ర స్థాయిలో పార్టీ పటిష్టత సాధించలేకపోతున్నారు. నియోజకవర్గం ఇన్‌చార్జీ గౌతు శిరీషా ప్రస్తుతం ఉన్న కేడర్‌ను వదులుకోకుండా వైసీపీలో చోటు చేసుకున్న అసమ్మతి నేతలతోనే, ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న ఉద్యోగ సంఘాల ప్రతినిధులతో సంబంధాలు పెట్టుకొని వీరిపై ఆధార పడుతున్నారు. అంతే కాకుండా గ్రామ స్థాయిలో వైసీపీ అసమ్మతి కేదరుతోను, 2019 ఎన్నికల్లో వైసీపీలో చేరి తన ఓటమికి కారకులైన టీడీపీ కార్యకర్తలను, నేతలను గాలం వేస్తున్నారు. నేరుగా వీరితో సంబంధాలు ఏర్పాటు చేసుకుంటూ భరోసా పొందుతున్నట్లు ప్రచారం జరుగుతుంది. ఇక టీడీపీలో కూడా మరో వాదన ఆసక్తికరంగా వినిపిస్తోంది. టీడీపీ టిక్కెట్ కోసం ఆరాట పడే పలువురు ప్రముఖులు, శిరీషా నాయకత్వాన్ని వ్యతిరేకిస్తున్న కేదరు అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయంగా దెబ్బ తీయాలన్న ఆలోచన చేస్తున్నట్లు వినికిడి. గౌతు శిరీషాను ఈ అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయంగా దెబ్బ తీసి నష్టపరిస్తే భవిష్యత్‌లో టీడీపీ నాయకత్వం చేపట్ట వచ్చన్న ఆలోచన ఈ వర్గాలు చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విధంగా రెండు పార్టీల్లోను అసమ్మతి రగడ ఏర్పడింది. ఇరు పార్టీల నాయకత్వాలు అసమ్మతి పట్ల అప్రమత్తంగా ఉన్నప్పటికీ రాజకీయంగా భారీగా నష్ట పోయే పార్టీ ఏదీ అనేది ఎన్నికల నాటికి తెలుస్తోంది. ఇదిలా ఉండగా ఇటీవల నియోజకవర్గంలో జరుగుతున్న పరిణామాల పట్ల టీడీపీ ఇన్‌చార్జీ గౌతు శిరీషా రగులుతున్నారు. లింబుగాంనకు చెందిన తలగాన రాజశేఖర్‌పై కొంతమంది దాడి చేయడంతో ఆ సంఘటనకు మంత్రిని బాధ్యులు చేస్తూ గాంధీ విగ్రహం వద్ద టీడీపీ నిరసన కార్యక్రమం చేపట్టారు. దీనికి ధీటుగా సమాధానం చెబుతూ వైసీపీ నాయకులు కూడా అదే గాంధీ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి టీడీపీకి సవాల్ విసిరారు. నియోజకవర్గంలో ఎక్కడ ఎదైనా చిన్న సంఘటనలు జరిగితే వాటిని మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుపై ఆరోపిస్తూ గౌతు శిరీషా ధ్వజమెత్తడం దీనికి మంత్రి వర్గీయులు ధీటుగా సమాధానాలు చెప్పడం ఈ ప్రాంతంలో పరిపాటిగా మారింది. రెండు పార్టీల నాయకుల వ్యవహార శైలిని నియోజకవర్గ ప్రజలు గమనిస్తున్నారని, ఎన్నికల సమయంలో ఏ పార్టీకి ఓటర్ల దేవుళ్లు దీవిస్తారో చూడాల్సి ఉంది.

రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే సీఎం జగన్మోహన్ రెడ్డి సేవలు ఆవశ్యకం

ఆంధ్రప్రదేశ్ శాసనసభాపతి తమ్మినేని సీతారాం

విశాలాంధ్ర-పొందూరు: అభివృద్ధి సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుందని ఆంధ్రప్రదేశ్ శాసన సభాపతి తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. పొందూరు మండలం దల్లి పేట గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. సంబంధిత అధికారులు, సిబ్బందితో కలిసి ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్ల ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించిన లబ్ధిని వివరిస్తూ సమస్యలు తెలుసుకొన్నారు.నాలుగేళ్ల ప్రభుత్వ పాలనలో ప్రజలకు అందించిన లబ్ధిని వివరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకొన్నారు..ప్రజలు విన్నవించిన సమస్యలను అక్కడే ఉన్న అధికారులు ద్వారా తక్షణ పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పట్ల చిత్తశుద్ధి కలిగిన వైఎస్ జగన్మోహన్రెడ్డి లాంటి ముఖ్యమంత్రి రాష్ట్రాన్ని పాలించడం ప్రజల అదృష్టమన్నారు. ముఖ్యమంత్రి అమలు చేస్తున్న నవరత్న పథకాలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాయని అన్నారు.ప్రతి సచివాలయానికి ముఖ్యమంత్రి రూ.20 లక్షల నిధులు మంజూరు చేశారని ఆయా సమస్యలను పరిష్కరించాలనే సీఎం చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమన్నారు. ఏ ఇంటికెళ్ళిన సంక్షేమ పథకాలు అందుకున్న ప్రజలంతా ఆనందోత్సాహాలతో స్వాగతం పలుకుతున్నారన్నారు.రోడ్లు, డ్రైన్లు వంటి సమస్యలు విషయంలో పరిష్కారానికి తగిన చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆలోచనలతో దళారులకు అవకాశాలు లేకుండా నేరుగా సంక్షేమ పథకాలు అర్హతగల లబ్ధిదారులకు అందుతున్నాయన్నారు. సచివాలయ,వాలంటరీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పథకాలను నేరుగా ప్రజలకు చేరేలా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పారదర్శక పాలనను ప్రవేశపెట్టారన్నారు.రైతులకు రైతు భరోసా కేంద్రాలు ద్వారా విస్తృత సేవలు అందిస్తున్నారన్నారు. రానున్న రోజుల్లో రాష్ట్రం అభివృద్ధి మార్గంలో పయనించాలంటే జగన్మోహన్ రెడ్డి పాలన ద్వారా మాత్రమే సాధ్యం అన్నారు. ముందుగా సుమారు 46 లక్షల నిధులతో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికి మంచినీటి కొళాయి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, జడ్పిటిసి లోలుగు కాంతారావు అధ్యక్షులు మండల పార్టీ అధ్యక్షులు రమేష్ కుమార్ వైస్ ఎంపీపీ ప్రతినిధులు కాకర్ల రాజారావు, వండన సురాపునాయుడు స్థానిక సర్పంచ్ కంబాపు నీలవేణి,స్థానిక నాయకులు కంబాపు సూర్యారావు,ఎంపీటీసీ కొన్న రమణ, దల్లి పాపి నాయుడు, వండన అప్పల నాయుడు మరియు వైఎస్ఆర్ పార్టీ సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు కార్యకర్తలు అధికారులు, సచివాలయం సిబ్బంది వాలంటీర్లు పాల్గొన్నారు.

పాలనా సంస్కరణలతోనే అభివృద్ధి

సిఆర్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు

విశాలాంధ్ర-ఎచ్చెర్ల: పాలనలో తీసుకువచ్చిన సంస్కరణలు ప్రయోజిత పథకాల అమలుతోనే రాష్ట్రం అభివృద్ధి పథంలో నడుస్తున్నట్లు సి ఆర్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు అన్నారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీలో అవర్ స్టేట్ అవర్ లీడర్ వైఎస్ఆర్ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో సువరిపాలనా దిశగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం అనే అంశంపై మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్కు, వలంటీర్ల వ్యవస్థ, అమ్మ ఒడి తదితర ప్రభుత్వ పథకాలు ఎంతగానో ప్రయోజనం చేకూర్చాయన్నారు. విద్య, వైద్య రంగాల్లో పలు నూతన సంస్కరణలకు శ్రీకారం చుట్టారన్నారు. పలు అంతర్జాతీయ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకొని అన్ని రంగాల్లో అభివృద్ధికి కృషి జరుగుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పూర్వపు వీసీ ప్రొఫెసర్ వి బాల మోహన్దాస్ మాట్లాడుతూ సంక్షేమానికి నవ సమాజానికి అన్ని వర్గాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు చెప్పారు. దివంగత మాజీ సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలు సామాన్య ప్రజల ఆశయాలకు అనుగుణంగా ప్రస్తుత పాలన సాగుతున్నట్లు చెప్పారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ నిమ్మ వెంకటరావు మాట్లాడుతూ పూలే, గాంధీ, అంబేద్కర్, అమర్త్యసేన్ తదితర మహనీయుల ఆలోచనలను కలగలిపి ప్రజల ఆర్థిక స్వావలంబన దిశగా ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపట్టినట్లు చెప్పారు. ఏయూ విశ్రాంత ప్రొఫెసర్ కే తిమ్మారెడ్డి మాట్లాడుతూ ప్రజలకు అత్యవసరమైన విద్య, వైద్య, ఆహారం, నివాసం ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్య ఇస్తున్నట్లు తెలిపారు. ఇంటలెక్చువల్ ఫారం వ్యవస్థాపక కార్యదర్శి జి శాంతమూర్తి బి ఆర్ ఏ యు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ సిహెచ్ రాజేంద్రప్రసాద్, వర్సిటీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బిడ్డిక అడ్డయ్య, డీన్ డాక్టర్ ఎస్ ఉదయభాస్కర్ మాట్లాడారు. ప్రొఫెసర్ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ తమ్మినేని కామరాజు, డాక్టర్ బుడుమూరు రాజేష్, డాక్టర్ సిహెచ్ రాజశేఖర్, రచయిత చింతాడ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి : పేరాడ తిలక్

విశాలాంధ్ర-నందిగాం: మండలం గొల్లూరు పంచాయతీ పరిధిలోని సొంటునూరు గ్రామంలో మండల పరిషత్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణానికి నందిగాం ఎంపీపీ నడుపూరు శ్రీరామ్ మూర్తి తిలక్ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కాళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి హయాంలో గ్రామాలన్నీ అభివృద్ధి పథకంలో పయనిస్తున్నాయన్నారు. గిరిజన సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వినియోగించుకొని ప్రతి ఒక్కరూ ఆర్థిక అభివృద్ధి సాధించడంతోపాటు గ్రామంలో అభివృద్ధి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు కురమాన బాలకృష్ణ రావు, ఎంపీటీసీ సభ్యులు సైలాడ లావణ్య, అంబోధి విష్ణు, నందిగాం మండల యువజన నాయకులు జీరు లక్ష్మణ్ రెడ్డి, సర్పంచులు బొమ్మాళి గున్నయ్య, మడపాల సంజీవరావు, తమరు దేవేందర్, వైఎస్ఆర్సిపి నాయకులు సొంటునూరు గిరిజన మహిళలు యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

వాలిన విద్యుత్ స్తంభం... పొంచి ఉన్న ప్రమాదం

విశాలాంధ్ర-ఆమదాలవలస: మండలంలో కొర్లకోట నుంచి ఇటు చీమల వలస అటు వెదుళ్ళ వలస వెళ్లే రహదారి గుండ వేసిన విద్యుత్ స్తంభాలు ఎక్కడికక్కడ వాలిపోయి ప్రయాణికులకు ప్రమాద సంకేతాలు అందిస్తున్నాయి. వీటిని ఎవరి ప్రయోజనం కోసం ప్రభుత్వం లోని పెద్దలు సహకారంతో అధికారులు వీటిని అమర్చినట్లు తెలుస్తుంది. గ్రామస్తులకు రోడ్డు మార్గం గుండ విద్యుత్ అలంకరణ చేస్తామని అప్పట్లో అధికారులు వివరించారు. కానీ వాటిని వేరే కారణాలకు వినియోగించడంపై సర్వత్ర నిరసన వ్యక్తం అవుతుంది. దీనికి అందరూ సహకారం ఉందని వాదన వినిపిస్తుంది. మండలంలోని కొర్లకోట గ్రామం వద్ద విద్యుత్ స్తంభం వరిగి పోవటంతో ప్రమాదం పొంచి ఉన్నట్లు గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొద్ది నెలల క్రితం కొర్లకోట గ్రామం నుండి మంగళ వాని చెరువు వైపు స్తంభాలను వేశారు. వీధి దీపాలు వెయ్యాలని ఆలోచనతో స్తంభాలు వేసినప్పటికీ వైర్లు అమర్చ క పోవడంతో మొండిగా మిగిలాయి. స్తంభాలు వేసేట ప్పుడు తూతూ మంత్రంగా అమర్చారు. ఇటీవల పడిన వర్షాలకు ఒరిగి పోతున్నా యి. ఏపీ ఫైబర్ నెట్వర్క్ కేబుల్ లేకపోతే స్తంభం రోడ్డుపై పడిపోయి ఉండేది. నిత్యం ఈ రహదారి గుండ వందలాది వాహనాలు వస్తూ వెళుతూ ఉంటాయి. ఎప్పుడు ఎవరిపై స్తంభం పడుతుందో నని గ్రామస్తులు ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. ఎవరి ప్రయోజనాల కోసం విద్యుత్ స్తంభాల నామర్చారు వారైనా వాటి నిర్వహణ చూడాల్సిన అవసరం ఉంది. ఏది ఏమైనా ప్రమాదపు అంచున ఉన్న వాటిని సరిదిద్దాల్సిన విద్యుత్ శాఖ అధికారులు కి నుకు వహించటం సరికాదని గ్రామస్తులు ముక్త కంఠంతో అంటున్నారు.

కేంద్ర మంత్రిని కలిసిన ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

విశాలాంధ్ర-రణస్థలం: పార్వతీపురం మన్యం జిల్లా, సాలూరులో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయం. 561.88 ఎకరాల్లో రూ.834 కోట్లతో కేంద్రీయ గిరిజన విశ్వవిద్యాలయానికి, ఇతర మౌలిక వసతుల కల్పనకు కేంద్ర విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ చేతుల మీదుగా సీఎం వైయస్ జగన్మోహన్ రెడ్డి సమక్షంలో శనివారం శంకుస్థాపన కార్యక్రమానికి విచ్చేసిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.యస్ జగన్మోహన్ రెడ్డి, కేంద్ర విద్య, నైపుణ్యాభివృద్ధి శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ కు ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్ కుమార్ పుష్పగుచ్చం ఇచ్చి మర్యాదపూర్వకంగా కలిశారు.

రైల్వే గేటులో ప్రయాణీలకులు ఇక్కట్లు

విశాలాంధ్ర-జలుమూరు: చిన్నదూగా పంచాయతీ తిలారు రైల్వే స్టేషన్ సమీపంలో పర్లాకిమిడి ప్రధాన రహదారి గేటు వద్ద నిత్యం అనేక ఇబ్బందులు పడుతున్నామని పలువురు ప్రయాణికులు వాపోతున్నారు. గత మూడు సంవత్సరాలుగా ఫ్లైఓవర్ నిర్మాణ పనులు సాగుతున్నా, నేటికీ అది పూర్తి కాకపోవడంతో ప్రయా ణికులు ఇబ్బదులు పడాల్సిన పరిస్థితి. నత్తనడకన పనులు జగుగుతుండడంతో ప్రయాణికులు ఈ రహదారి నుండే ప్రయాణం చేయాల్సివస్తుంది. ఈ రహదారిలో రైల్వే గేటు గంటల వేచియుండాల్సివస్తుందని పలువురు ప్రయాణీకులు కాలం గేటు వేసిన పరిస్థితులు ఉన్నాయి. కనుక సత్వరమే ఫ్లైఓవర్ వంతెన నిర్మాణ పనులను చేపట్టాలని పలువురు ప్రయాణీకులు కోరుతున్నారు.

వంశధార కాలువలో వలల జోరు

విశాలాంధ్ర-జలుమూరు: కరకవలస నుంచి రాణ వరకు 13 కిలోమీటర్ల పొడవు గల ప్రధాన వంశధార కాలువ పెద్దదూగం షట్టర్ వద్ద రొయ్యల కోసం భారీ వలలు ఏర్పాటు చేస్తున్నారు. వరద ప్రవాహానికి వలలు వెళ్లిపోకుండా భారీ గునపాలు, తాళ్లు గట్లపై ఏర్పాటు చేయడంతో గట్లు వర్షాల సమయంలో పాడవుతున్నాయి. దీనివల్ల వంశధార కాలువ గట్లుకు నష్టం కలుగుతున్నాయని ఆ ప్రాంత రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రతీఏటా రొయ్యలు అమ్మకానికి అలవాటు పడేవారు, ఈ పనిని మానలేకపోతున్నారు. అధికారులు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ వలల వల్ల నీటి ప్రవాహానికి కాస్త ఇబ్బంది ఏర్పడుతుందని పలువురు రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి కాలువ నుంచి వలలను తొలగించాలని పలువురు కోరుతున్నారు.